• రంగనాయక సాగర్..



అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి చంద్లాపూర్ పంప్‌హౌస్ ద్వారా సిద్దిపేట జిల్లా రంగనాయకసాగర్‌లోకి వస్తున్న గోదావరి జలాలు

• మల్లన్న సాగర్..




రంగనాయక్‌సాగర్ నుంచి తుక్కాపూర్ సర్జ్‌పూల్ ద్వారా మల్లన్న సాగర్‌లోకి పరుగులు తీస్తున్న జలాలు

• కొండపోచమ్మ సాగర్..



మల్లన్నసాగర్ నుంచి మర్కూక్ పంప్‌హౌస్ ద్వారా కొండపోచమ్మ సాగర్‌లోకి దుంకుతున్న గోదావరి జలాలు

## లోకం పోకడ




నీటి పారుదలశాఖ గదా, చేతులు తడుపందే పనికాదంటున్నాడు సార్!

# నీళ్లను వాడుకునే తెలివిలేదా?

- బంగారంలాంటి నీళ్లు బంగాళాఖాతంలోకి
- అవగాహనలేక వదిలేస్తున్న సర్కార్
- రాజకీయ కక్షతో రైతుల్ని ఆగం చేస్తున్నది
- మన రిజర్వాయర్లు వెలవెలబోతున్నయ్ ఆంధ్రాలో కళకళలాడుతున్నయ్
- ధ్వజమెత్తిన మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



తెలంగాణ భవన్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్, విజయార్య క్షేత్రియా

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ) : అవగాహన, రైతులపై చిత్తశుద్ధి లేక కాంగ్రెస్ ప్రభుత్వం బంగారం లాంటి నీళ్లను బంగాళాఖాతంలోకి వదులుతున్నదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ధ్వజమెత్తారు. పాలమూరు జిల్లాలో రైతులు నీటి కోసం ఎదురు చూస్తున్నారని, కృష్ణా జలాలు సగటున రోజుకు 30 టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయని చెప్పారు. తెలంగాణభవన్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల వ్యవస్థ పూర్తి సిద్ధంగా ఉన్నదని, నార్లాపూర్ నుంచి ఏదుల మీదుగా వట్టెం వరకు 27 టీఎంసీల నీటిని ఒడిసిపట్టే అవకాశం ఉన్నదని తెలిపారు. ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించడం లేదని, కేసీఆర్ కట్టిన ప్రాజెక్టు అన్న కారణంతోనే నీళ్లివ్వడం లేదని, పనులు మిగిలి ఉంటే ఈ 8 నెలల్లో పూర్తిచేసి నీరెందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఉన్న వ్యవస్థను వాడుకోకపోవడం ఎంత తెలివితక్కువ తనమో రైతులు ఆలోచించాలని సూచించారు. కాళేశ్వరం విషయంలో మొదట ఇలాగే చేసి ఇప్పుడు నీటిని ఎత్తిపోస్తున్నారని గుర్తుచేశారు. కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉన్నది కాబట్టే పెండింగ్ ప్రాజెక్టులు, పాలమూరు-రంగారెడ్డి పనులను వేగవంతం చేశారని చెప్పారు. కరివెన నుంచి నీరు ముందుకుపోయేలా కాల్వల కోసం టెండర్లు పిలిస్తే వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు. నాలుగు పంప్ హౌస్‌లు, ఐదు రిజర్వాయర్ల పనులు పూర్తిచేస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి వాడుకునే తెలివి లేదని విమర్శించారు. కల్వకుర్తి ఎత్తిపోతల కింద గతంలో కాంగ్రెస్ కేవలం 3.9 టీఎంసీల జలాశయాలను మాత్రమే ప్రతిపాదించారని గుర్తుచేశారు. కల్వకుర్తి కింద సొరంగ వ్యాసం చాలా తక్కువ పెట్టి ద్రోహం చేశారని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి కింద దాదాపు 60 టీఎంసీల జలాశయాలు నిర్మించామని చెప్పారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద ఉన్న ఐదు పంపులు ఒకేసారి నడిపే అవకాశం లేకుండా కాల్వల సామర్థ్యం తగ్గించి ఉమ్మడి రాష్ట్రంలో పాలమూరుకు కాంగ్రెస్ ప్రభుత్వం తీరని ద్రోహం చేసిందని మండిపడ్డారు. పాలమూరు బిడ్డను అని పదేపదే చెప్పుకొనే సీఎం రేవంత్‌రెడ్డి ఇక్కడ రైతులు ఇబ్బందులు పడుతుంటే అమెరికాలో మిసిసిపి అందాలు చూస్తూ కూర్చుంటారా ? అని ప్రశ్నించారు. 'వీరా పాలమూరు బతుకులను మార్చేది?' అంటూ ఎద్దేవాచేశారు.

### తెలంగాణ రైతులపై కుట్ర: ఆర్‌ఎస్పీ

తెలంగాణ రైతులపై కుట్ర జరుగుతున్నదని బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం కంటే ఎక్కువ సామర్థ్యమున్న పంపులతో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును కేసీఆర్ చేపట్టారని, ప్రపంచంలో అద్భుతాన్ని అధోగతి పాలుచేసే పనిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నదని మండిపడ్డారు. పాలమూరు బిడ్డ అని పదేపదే చెప్పుకొనే సీఎం రేవంత్ రెడ్డి, ఇప్పటివరకు ప్రాజెక్టు వద్దకు వెళ్లలేదని ఎద్దేవాచేశారు. ఇక్కడ రోజుకు 30 టీఎంసీలకు పైగా నీళ్లు సముద్రంలో కలుస్తుంటే రేవంత్‌రెడ్డి అమెరికాలోని మిసిసిపి అందాలను ఆస్వాదిస్తున్నాడని దుయ్యబట్టారు. తెలంగాణ రిజర్వాయర్లు వెలవెలబోతున్నాయని, ఆంధ్రా రిజర్వాయర్లు కళకళలాడుతున్నాయని, చంద్రబాబు ఆదేశాలమేరకే పనిచేస్తున్నారా? అని రేవంత్‌రెడ్డిని నిలదీశారు. 2016లో పాలమూరు-రంగారెడ్డి, డిండి ఉండరాదని నాడు కేంద్ర మంత్రి ఉమాభారతి వద్ద చంద్రబాబు పట్టుబట్టారని గుర్తుచేశారు. తాజా బడ్జెట్‌లో పాలమూరు ప్రాజెక్టులకు కనీస కేటాయింపులు లేవని విమర్శించారు. సాగునీటి బడ్జెట్‌ను రూ.44వేల కోట్ల నుంచి 22వేల కోట్లకు కుదించారని చెప్పారు. మూసీ సుందరీకరణ మీద ఆసక్తి చూపుతున్న రేవంత్‌రెడ్డి ఆ ప్రాజెక్టు మూలంగా ఎంతమంది జీవితాలు బాగుపడతాయో?, ఎన్ని ఎకరాలకు నీరందుతుందో? రాష్ట్ర జీడీపీ ఎంత పెరుగుతుందో చెప్పాలని ప్రశ్నించారు. 1.50 లక్షల కోట్లతో మూసీని సుందరీకరిస్తామంటున్న రేవంత్ రెడ్డి పాలమూరు మీద ఎందుకు ప్రేమ చూపడం లేదని నిలదీశారు. డ్రోన్ విషయంలో కేటీఆర్‌పై కేసు పెట్టారని, రాష్ట్రంలో రోజూ ఎన్ని డ్రోన్లు ఎగరడం లేదు? అని ప్రశ్నించారు. ఇది ప్రజాపాలనా? ప్రజలపై ప్రతీకార పాలనా? తెలంగాణ అంటేనే రేవంత్ రెడ్డికి ఎందుకంత కోపమంటూ ధ్వజమెత్తారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులను మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెల్ల ఏనుగులు అంటూ చంపే ప్రయత్నం చేస్తున్నారా? అని ప్రశ్నించారు.

## 26 గేట్లు ఎత్తి సాగర్ నీటి విడుదల

న్యూస్‌నెట్‌వర్క్, ఆగస్టు 9 : కృష్ణానదికి వరద పోటెత్తుండటంతో నాగార్జునసాగర్ 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల చేస్తున్నారు. ఈ నెల 5న క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల ప్రారంభం కాగా, రోజూ 2 నుంచి 3 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. శుక్రవారం నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు 2,94,009 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా అవుట్‌ఫ్లో 2,77,453 క్యూసెక్కులు ఉంది. 26 క్రస్ట్ గేట్ల ద్వారా 2,29,886 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ రిజర్వాయర్ నీటి మట్టం 590 (312 టీఎంసీలు) అడుగులకు గాను 587.30 (305.6838 టీఎంసీలు) అడుగుల మేర నీరు నిల్వ ఉన్నది.

### జూరాలలో 39 గేట్లు ఎత్తివేత

జూరాల ప్రాజెక్టుకు శుక్రవారం 2.90 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 2,91,936 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. పూర్తి స్థాయి నీటినిల్వ 9.657 టీఎంసీకు గాను ప్రస్తుతం 8.300 టీఎంసీలుగా ఉన్నది. శ్రీశైలం ప్రాజెక్టుకు 3,92,415 క్యూసెక్కుల వరద వస్తున్నది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మేడిగడ్డ బరాజ్‌కు వరద క్రమంగా తగ్గుతున్నది. శుక్రవారం 3,10,080 క్యూసెక్కుల ప్రవాహం రాగా, 85 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. అన్నారం బరాజ్‌కు మానేరు, కాల్వల ద్వారా 3800 క్యూసెక్కుల నీరు వస్తున్నది.

## వానకాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 34.3°c | 24.6°c |
| ఖమ్మం | 33.0°c | 24.0°c |
| కరీంనగర్ | 32.0°c | 25.0°c |
| హైదరాబాద్ | 31.6°c | 23.4°c |
| రంగారెడ్డి | 31.6°c | 21.9°c |
| మహబూబ్‌నగర్ | 31.2°c | 23.5°c |
| వరంగల్ | 31.0°c | 24.0°c |
| నిజామాబాద్ | 30.3°c | 24.2°c |
| నల్లగొండ | 30.0°c | 23.4°c |
| మెదక్ | 22.5°c | 31.6°c |

## లింక్-2లో గోదావరి పరుగులు

ధర్మారం/రామడుగు/బోయినపల్లి, ఆగస్టు 9: కాళేశ్వరం ప్రాజెక్టు లింక్-2లో ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ఎల్లంపల్లి జలాశయం నుంచి అండర్ టన్నెళ్ల ద్వారా పెద్దపల్లి జిల్లాలోని నంది పంప్‌హౌస్‌కు జలాలు చేరుతుండగా, శుక్రవారం ఒక మోటర్ ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని నంది రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నారు. అక్కడి నుంచి జంట సొరంగాల ద్వారా కరీంనగర్ జిల్లా లక్ష్మీపూర్‌లోని గాయత్రీ పంప్‌హౌస్‌కు తరలిపోతున్నాయి. ఇక్కడ సైతం ఒకే మోటర్‌ను నడిపిస్తున్నారు. మొత్తం 3,150 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తూ రాజరాజేశ్వర జలాశయానికి తరలిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం వరకు ఎల్లంపల్లి నుంచి 12.75 టీఎంసీల జలాలు మధ్య మానేరుకు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఈ జలాశయంలో 27.54 టీఎంసీల నీటికి ప్రస్తుతం 17.15 టీఎంసీల నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

### రంగనాయకసాగర్‌కు పరవళ్లు

మధ్యమానేరు నుంచి సిరిసిల్ల జిలా అన్నపూర్ణ ప్రాజెక్టుకు చేరుతున్న జలాలు రంగనాయకసాగర్ వైపు పరుగెడుతున్నాయి. మధ్యమానేరు నుంచి అండర్ టన్నెళ్ల ద్వారా తిప్పాపూర్‌లోని సర్జ్‌పూల్‌కు జలాలు చేరుతుండగా, ఇక్కడ పంప్‌హౌస్‌లో రెండు మోటర్ల ద్వారా 6,440 క్యూసెక్కులు అన్నపూర్ణ జలాశయానికి తరలిస్తున్నారు. ఇక్కడ జలాశయం గేట్లు తెరిచి అంతే మొత్తంలో రంగనాయకసాగర్‌కు వదులుతున్నారు. అన్నపూర్ణ జలాశయంలో 3.5 టీఎంసీల సామర్థ్యానికిగాను ప్రస్తుతం 1.25 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు.

## జలాశయాల్లో గోదావరి గలగలలు

### హరీశ్‌రావు లేఖతో దిగివచ్చిన ప్రభుత్వం.. ఈనెల 4 నుంచి ఎత్తిపోతలు ప్రారంభం

సిద్దిపేట, ఆగస్టు 9 (నమస్తేతెలంగాణ ప్రతినిధి): కాళేశ్వరం ప్రాజెక్టు ప్రధాన జలాశయాల్లో గోదావరి జలాలు గలగలాపారుతున్నాయి. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు లేఖతో రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి జలాశయాలను నింపుతున్నది. ఈనెల 4 నుంచి ఎత్తిపోతలు ప్రారంభం కాగా, అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్లకు గోదావరి జలాలు చేరుతుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ రిజర్వాయర్లు నిర్మించడం వల్లనే సాగు నీరు వస్తున్నదని రైతులు వరినాట్లు వేసే పనిలో బిజీబిజీగా గడుపుతున్నారు.

**జలాశయాల్లో నీటి సామర్థ్యం ఇలా...**

| జలాశయం | సామర్థ్యం | ప్రస్తుత సామర్థ్యం | ఇన్‌ఫ్లో | అవుట్ ఫ్లో |
|---|---|---|---|---|
| అన్నపూర్ణ | 3.50 టీఎంసీలు | 1.22 టీఎంసీలు | 6400క్యూసెక్కులు | 6600 క్యూసెక్కులు |
| రంగనాయక | 3 టీఎంసీలు | 2.05 టీఎంసీలు | 6,600క్యూసెక్కులు | 5,200 క్యూసెక్కులు |
| మల్లన్నసాగర్ | 50 టీఎంసీలు | 8.06 టీఎంసీలు | 5,200 క్యూసెక్కులు | 2,600 క్యూసెక్కులు |
| కొండపోచమ్మ | 15 టీఎంసీలుల | 4.07 టీఎంసీలు | 2,600క్యూసెక్కులు | 2,500 క్యూసెక్కులు |

## అర్హులందరికీ రుణమాఫీ

- పంట పండిస్తేనే రైతుభరోసా
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



కోదాడ, ఆగస్టు 9 : అర్హులందరికీ రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని, రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పద్మావతితో కలిసి రైతులు, కాంగ్రెస్ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. రైతు భరోసా, రుణమాఫీ, సన్నవడ్లకు బోనస్‌పై చర్చించారు. రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. 3వ విడత రుణమాఫీ ఆగస్టు 15కల్లా పూర్తవుతుందని మంత్రి చెప్పారు. వరికి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని సూచించారు. రైతు భరోసాపై మాట్లాడుతూ.. నాలుగు జిల్లాల్లో రైతుల అభిప్రాయాలు సేకరించాల్సిన ఉందని, పంట పండించే రైతులకే భరోసా ఇవ్వాలనేది ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కౌలు రైతులను గుర్తించే అంశంపైనా అభిప్రాయాలు సేకరించాకే నిధులు విడుదల చేస్తామన్నారు. ఆయిల్‌పామ్ సాగు చేసేవారికి ప్రభుత్వం ఎకరాకు రూ.55 వేల సబ్సిడీ అందజేస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## అదును దాటుతున్నా నీళ్లేవీ?

- సూర్యాపేటలో కాళేశ్వరం ఆయకట్టు ప్రశ్నార్థకం
- రెండున్నర లక్షల ఎకరాలపై తీవ్రప్రభావం
- పంపులు ముందే నడిపిస్తే ఇప్పటికి చేరేవి
- షెడ్యూల్ ప్రకటించక ఆందోళనలో రైతులు

సూర్యాపేట, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ) : కాళేశ్వరం ప్రాజెక్టును పనికిరానిదిగా చూపాలనే పంతానికి పోయి కాంగ్రెస్ సర్కారు రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టింది. రాజకీయ ప్రయోజనాలకే పెద్దపీట వేసుకొని అన్నదాతల నోట్లో మట్టికొడుతున్నది. ప్రభుత్వ నిర్వాకంతో సూర్యాపేట జిల్లాలో దాదాపు రెండున్నర లక్షల ఎకరాల కాళేశ్వరం ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారింది. జిల్లాకు ఓవైపు కృష్ణా, మరోవైపు గోదావరి జలాలు అందుతాయి. నాగార్జునసాగర్ ఇప్పటికే నిండడంతో దాని ఆయకట్టుకు ఢోకా లేకపోయినా కాళేశ్వరం ఆయకట్టుపై నీలినీడలు కమ్ముకున్నాయి. కేసీఆర్ సర్కారు మాదిరి ప్రణాళికాబద్ధంగా మేడిగడ్డ పంపులను ముందే ఆన్ చేసి ఉంటే ఇప్పటికే జలాలు జిల్లాకు చేరుకునేవి. బీఆర్‌ఎస్ పోరాటాల ఫలితంగా ఇటీవల మోటర్లను ఆన్ చేసినా ఆ నీళ్లు జిల్లాకు ఎప్పుడు చేరుతాయో అధికారులకే తెలియటం లేదు. అదును దాటుతున్నా నీటి విడుదల షెడ్యూల్ లేక ఆందోళన నెలకొన్నది.

### ఐదేండ్ల పాటు ఏటా 30 టీఎంసీలు

బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు సూర్యాపేట జిల్లాకు 2019 నుంచి 2023 వరకు ఐదేండ్ల పాటు ఏడాదికి రెండు సీజన్లకు గాను 24 నుంచి 30 టీఎంసీల నీళ్లు కాళేశ్వరం నుంచి అందాయి. ప్రతి సీజన్‌కూ కాల్వల్లో 1,200 నుంచి 1,700 క్యూసెక్కుల చొప్పున అవసరాన్ని బట్టి సీజన్‌కు 65 రోజుల నుంచి 100 రోజుల పాటు నిరంతరాయంగా విడుదల చేశారు. బయ్యన్నవాగు నుంచి కాల్వల ద్వారా నేరుగా పంట పొలాలకు సీజన్‌కు 12 క్యూసెక్కులతో పాటు జిల్లాలో గోదావరి ఆయకట్టు పరిధిలోని దాదాపు 1,200 చెరువులు, కుంటలు నింపేందుకు మరో 2 టీఎంసీలు కలిపి సీజన్‌కు 12 నుంచి 15 టీఎంసీల చొప్పున విడుదల చేశారు. దీంతో ఏడాదంతా ఆయకట్టు చెరువులు జలకళతో ఉండేవి. ఐదేండ్లు బీఆర్‌ఎస్ ప్రభుత్వం జూలై రెండు నుంచి ఆగస్టు మొదటి వారంలోనే నీటిని అందించింది.

### వానకాలాన్ని కూడా ముంచుతుందా?

కాళేశ్వరంతో కేసీఆర్‌కు వచ్చిన గుర్తింపును తొలగించే కుట్రలకు దిగి కాంగ్రెస్ సర్కారు సూర్యాపేట జిల్లా రైతుల నోట్లో మట్టికొట్టింది. గోదావరి ఉగ్రరూపం దాల్చి వరద పోటెత్తినా మేడిగడ్డ బరాజ్ తట్టుకొని నిలబడటంతో కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చి పంపులు ఆన్ చేసింది. మేడిగడ్డ వద్ద పంపులను నెల ముందు ఆన్‌చేసి ఉంటే ఇప్పటికే సూర్యాపేటకు నీళ్లు చేరేవని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా నీటి షెడ్యూల్ ప్రకటించాలని కోరుతున్నారు.

**• నీళ్ల కోసం ఎదురుచూస్తున్నం**



ఈ వానకాలానికి సంబంధించి సాగు పనులు మొదలైనయ్. నీటి వసతి ఉన్న రైతులు పొలాలు దున్నుతుంటే గోదావరి జలాలపై ఆధారపడి పంటలు వేసే నాలాంటోళ్లు కాళేశ్వరం నీళ్లకోసం చూస్తున్నం. నీటి విడుదల షెడ్యూల్ త్వరగా ప్రకటిస్తే పంటలు సాగు చేసుకుంటం. షెడ్యూల్ రానిదే రైతులు ముందుకు వెళ్లలేని పరిస్థితి ఉన్నది.

-మిర్యాల వెంకన్న, రైతు, పర్సాయపల్లి, అర్వపల్లి



ఏసీబీ దాడుల్లో పట్టుబడిన నగదు, నగలు లెక్కిస్తున్న అధికారులు

## మున్సిపల్ అధికారి ఇంట్లో నోట్ల గుట్టలు

- రూ.2.93 కోట్ల నగదు, 51 తులాల బంగారం
- రూ.6 కోట్లపైగా ఆస్తులు సీజ్ చేసిన ఏసీబీ
- లెక్కింపునకు ఆరు గంటల సమయం
- నిజామాబాద్‌లోని ఇంటిపై ఏసీబీ దాడులు

వినాయక్‌నగర్, ఆగస్టు 9: నిజామాబాద్ మున్సిపాలిటీ సూపరింటెండెంట్ ఇంట్లో నోట్ల గుట్టలు బయటపడ్డాయి. పట్టుబడ్డ నగదు, నగలు చూసి ఏసీబీ అధికారులే విస్తుపోయారు. కార్పొరేషన్‌లో బిల్ కలెక్టర్ స్థాయి నుంచి ఆర్‌ఐగా, తర్వాత సూపరింటెండెంట్ వరకు సుమారు దశాబ్ద కాలంగా ఇక్కడే పని చేస్తున్న దాసరి నరేందర్.. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నాడని నేరుగా ఏసీబీ డైరెక్టర్ సీవీ ఆనంద్‌కు సమాచారం అందింది. ఈ మేరకు దాసరి నరేందర్ నివాసంతోపాటు సంబంధీకుల ఇండ్లు, ఆఫీస్ చాంబర్‌లో శుక్రవారం తెల్లవారుజామున 25 మందితో కూడిన ఏసీబీ అధికారుల బృందాలు ఏకకాలంలో దాడులు చేశాయి. ఈ దాడుల్లో రూ.6 కోట్లకు పైగా విలువైన ఆస్తులు వెలుగుచూశాయి. జిల్లా కేంద్రంలోని బస్వాగార్డెన్ ఏరియాలో ఆర్‌ఐ నివాసమంటున్న అపార్ట్‌మెంట్‌లో, కోటగల్లిలో ఉంటున్న తల్లి నివాసంలో, నిర్మల్ జిల్లాలోని అత్తగారింట్లో సోదాలు జరిగాయి. నరేందర్ నివాసంలో ఎక్కడ చూసినా రూ.500 నోట్ల కట్టలు లభ్యమయ్యాయి. వాటిని కౌంటింగ్ మిషన్లతో లెక్కించడానికే ఐదు గంటలకు పైగా సమయం పట్టినట్టు తెలిసింది. 11 గంటలకు పైగా జరిగిన తనిఖీల్లో రూ.2.93 కోట్ల నగదుతోపాటు రూ.6 లక్షల విలువైన 51 తులాల బంగారు ఆభరణాలు, భార్య, తల్లి పేరిట బ్యాంకుల్లో ఉన్న బ్యాలెన్స్ రూ.1.10 కోట్లు, రూ.1.98 కోట్ల విలువ చేసే ఆస్తిపత్రాలను సీజ్ చేసినట్టు ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ వివరించారు. మరిన్ని సోదాలు జరుగుతున్నాయని, నిందితుడిని అరెస్టు చేసి హైదరాబాద్‌లోని ఏసీబీ కోర్టు ఎదుట హాజరు పరిచామని తెలిపారు. ఓ స్థాయి ఉద్యోగి వద్ద ఇంత భారీ మొత్తంలో అక్రమాస్తులు లభించడం ఏసీబీ రికార్డులో ఇదే మొదటిసారి అని అధికారులు చెప్తున్నారు.

## 5 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఏఈ



చెన్నూర్, ఆగస్టు 9: మంచిర్యాల జిల్లా చెన్నూర్ నీటిపారుదల శాఖ ఏఈ జాడి చేతన్ రూ.5 వేల లంచం తీసుకుంటూ శుక్రవారం ఏసీబీకి చిక్కారు. చెన్నూర్ మండలం కిష్టంపేట బొమ్మ చంద్రశేఖర్‌రెడ్డి 2016-17లో మిషన్ కాకతీయలో దుగ్నెపల్లి సాలేకుంట పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఈఎండీ, ఎఫ్‌ఎస్‌డీ బిల్లుల చెల్లింపుల కోసం ఎంబీ సమర్పించేందుకు ఏఈ చేతన్ రూ.5 వేలు డిమాండ్ చేయగా ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. చెన్నూర్ కార్యాలయంలో చంద్రశేఖర్‌రెడ్డి నుంచి ఏఈ రూ.5 వేలు తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి పట్టుకుని కోర్టులో హాజరుపర్చారు.

# సమ్మక్కసాగర్ నుంచే గోదావరి-కావేరి లింక్

- బారాజ్ 83-87మీటర్ల మధ్య నీటి తరలింపు!
- సూత్రప్రాయంగా అంగీకరించిన తెలంగాణ
- మళ్లించే జలాల్లో 50శాతం వాటాకు పట్టు
- రాష్ట్ర అధికారులతో చైర్మన్ భోపాల్‌సింగ్ భేటీ



హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ) : గోదావరి-కావేరి నదుల అనుసంధాన ప్రాజెక్టును సమ్మక్కసాగర్ నుంచే చేపట్టేందుకు తెలంగాణ సూత్రప్రాయంగా అంగీకరించి పలు డిమాండ్లను ముందుపెట్టింది. అధ్యయనం తర్వాత నిర్ణయం తీసుకుంటామని, జీసీ రివర్ లింక్‌కు పెద్దమనసుతో అంగీకరించాలని తెలంగాణకు ఎన్‌డబ్ల్యూడీఏ విజ్ఞప్తి చేసింది. జీసీ లింక్ ప్రాజెక్టు ఎక్కడి నుంచి చేపట్టాలనే అంశంపై కొంతకాలంగా తర్జనభర్జనలు కొనసాగుతున్నాయి. ఈ విషయంలో తెలంగాణ అనేక సాంకేతిక అంశాలను ఎత్తిచూపుతున్నది. ఈ నేపథ్యంలో జలసౌధలో జాతీయ నీటి అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం కొనసాగింది. సంస్థ డైరెక్టర్ తరపున జనరల్ (డీజీ) భోపాల్‌సింగ్, దక్షిణాది విభాగం చీఫ్ ఇంజినీర్ దేవేందర్‌రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు హాజరుకాగా తెలంగాణ నుంచి సాగునీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్సీ (జనరల్) జీ అనిల్‌కుమార్, అంతర్రాష్ట్ర వ్యవహారాల చీఫ్ ఇంజినీర్ మోహన్‌కుమార్, డీడీ గోదావరి సుబ్రహ్మణ్యప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ అభ్యంతరాలు, డిమాండ్లను ఎన్‌డబ్ల్యూడీఏకు రాహుల్ బొజ్జా నివేదించారు. ఆయన మాట్లాడుతూ ఇచ్చంపల్లిలో రిజర్వాయర్ నిర్మాణంతో ఇబ్బందులున్నాయని అధ్యయనంలో తేలినట్టు వెల్లడించారు. 83 మీటర్ల ఎత్తుతో కట్టిన సమ్మక్క బరాజ్‌నులో 83-87 మీటర్ల మధ్య నీటిని నిల్వచేసి, వాటిని మాత్రమే జీసీ లింక్‌లో తరలించాలని ప్రతిపాదించారు. 83మీటర్ల దిగువన ఉన్న నీటిని ముట్టుకోరాదని, దీంతో సీతమ్మ ప్రాజెక్టు కింద 70 టీఎంసీలు, సమ్మక్క కింద 50 టీఎంసీలు, దేవాదుల కింద 38 టీఎంసీలు కలుపుకొని 158 టీఎంసీల అవసరాలున్నాయని, ఆ హక్కులకు రక్షణ కల్పించాలని కోరారు. జీసీ లింక్ కాలువలు, టన్నెళ్ల నిర్మాణ మార్గంలో రెండు పంటలు పండే భూములున్నాయని, వాటిని ఇచ్చేందుకు రైతులు ముందుకు రాకపోవచ్చని, కాబట్టి సమ్మక్క బరాజ్‌కు చెందిన కన్వేయర్ సిస్టమ్‌నే వాడుకోవాలని తెలంగాణ ప్రతిపాదించింది. కృష్ణా జలాల పంపిణీపై బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ విచారణ పూర్తయి నీటివాటాలు, ఆపరేషనల్ ప్రొటోకాల్ తేలిన తర్వాతే నాగార్జునసాగర్ రిజర్వాయర్‌ను జీసీ లింక్‌కు వినియోగించుకోవాలని కేంద్రానికి స్పష్టంచేశారు. జీసీ లింక్ ఎంవోఏపై సంతకాల గురించి తొందరవద్దని సూచించారు. ఛత్తీస్‌గఢ్ వాడుకోని వాటాను జీసీ లింక్‌లో తరలిస్తున్న నేపథ్యంలో ముందుగా ఆ రాష్ట్ర సమ్మతి తీసుకోవాలని, సమ్మక్క బరాజ్ ఎత్తును 87 మీటర్లకు పెంచుకునేందుకు కాన్సంట్ పొందాలని స్పష్టంచేశారు. తెలంగాణ అభ్యంతరాలపై అధ్యయనం చేస్తామని, ఆ తర్వాతే నిర్ణయం తీసుకుంటామని ఎన్‌డబ్ల్యూడీఏ డీజీ భూపాల్‌సింగ్ వెల్లడించారు. గోదావరి-కావేరి లింక్‌లో 50 శాతం వాటాపై పట్టు సడలించాలని, సాధ్యమైనంత మేర తెలంగాణకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

## గౌరవెల్లి ప్రాజెక్టు కాల్వలకు 431.30కోట్లు

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): గౌరవెల్లి ప్రాజెక్ట్ కాల్వల నిర్మాణానికి ప్రభుత్వం రూ.431.30 కోట్లతో పరిపాలన అనుమతులిస్తూ శుక్రవారం ఉత్తర్వులిచ్చింది. రిజర్వాయర్ నిర్మాణం ఇప్పటికే పూర్తికాగా దీనిద్వారా హుస్నాబాద్, స్టేషన్‌ఘన్‌పూర్‌లోని 1,06,000 ఎకరాలకు నీరందించాల్సి ఉన్నది. రిజర్వాయర్ నుంచి 47.75 కిలోమీటర్ల ఎడమ కాల్వ నిర్మించాలి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఎస్సారెస్పీ-ఇందిరమ్మ వరద కాల్వ ప్యాకేజీ నంబర్7 మిగిలిన పనుల కోసం రూ.431.30 కోట్లు తాజాగా విడుదల చేసింది.